


# గుర్తింపు

యన్.కె.నాగేశ్వరరావు

వానాకాలం వచ్చిందంటేనే ఆ ఊర్లో అందరికీ వణుకు ప్రారంభమవుతుంది.

ఇహ... ఆగస్టు నెలంటే పై ప్రాణాలు పైనే పోతాయి. ఇవన్నీ ఊర్లో వారికి ఎందుకు కలుగుతాయని మీకు సందేహం రావచ్చు. ఆగస్టు నెలలో ఎక్కడో పడ్డ వర్షాలకు ఆ వూరికి అనుకొని ప్రవహిస్తున్న నదికి వరదలు వస్తాయి. అదీ సంగతి!

చెప్పుకోవడానికి ఆ నది జీవనదే. అయితే, వరదలొచ్చినప్పుడు మాత్రం అది పొంగెత్తిపోతుంది. ఏటిగట్ల బలహీనతను ఆసరాగా తీసుకొని కట్టలు తెగిన ప్రతిచోటా నీరు మొత్తం ఊరుమీదకొచ్చి పడి జననష్టం, వంట నష్టం, ఆస్తి నష్టం చేసిపోతూ ఉంటుంది.

ఇది ఆ ఊరికి ప్రతి సంవత్సరమూ మామూలే.

ఆ క్రమంలోనే ఎప్పట్లాగే ఈ ఏడాదీ ఆ నదికి వరదలొచ్చాయి.

అనుకున్నట్టే జన నష్టం జరిగిపోయింది.

రైతులు పండిస్తున్న కాయగూరల పంటలతో పాటు, వరి పంట కోసం సిద్ధం చేసుకున్న ఆకుమడులన్నీ నాశనం అయ్యాయి. వందలు, వేలు సంఖ్యలో పాకలు, పూరిళ్లు, మట్టిళ్ళు... కొన్నిచోట్లయితే, పెంకుటిళ్ళు కూలిపోవడమో, కొట్టుకుపోవడమో జరిగి, జనం నిరాశ్రయులయ్యారు.

ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది.

యుద్ధ ప్రాతిపదికన వరద బాధితులకు సహాయ చర్యలను ముమ్మరం చేసింది. అన్ని పార్టీల రాజకీయ నాయకులు వరద బాధితుల్ని పరామర్శించారు. అధికార పార్టీ మంత్రులూ వచ్చారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు అక్కడికక్కడే ఆర్థిక సహాయం ప్రకటించారు. గృహాలను కోల్పోయిన వారందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

ఆ ప్రకారం వెంటనే వరద బాధితుల గుర్తించడం, నష్టపడిన ఇళ్లను లెక్కించడం చేయమని తమ వెంట ఉన్న అధికారులకు ఆదేశాలిచ్చి వెళ్లిపోయారు.

ఆ వూర్లోని ప్రభుత్వ కార్యాలయంలో మంత్రులొచ్చి వెళ్ళిం తర్వాత సిబ్బంది 'చేతినిండా' పని చేరిపోయింది. ఆ కార్యాలయం ముందు నష్టపరిహారం కోరుతూ దరఖాస్తుచేసుకొనే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

* *** *

చేతిలో దరఖాస్తు కాగితంతో ఆఫీసులోకి నేరుగా అడుగుపెట్టిన అతని వంక కోపంగా చూశాడా కార్యాలయపు అధికారి.

బయట అటెండరు ఉండగా, నరాసరి తన దగ్గరకే అతను వచ్చేశాడన్న చిరాకు కనిపించింది అధికారి కళ్ళలో.

"అనుమతిదారుడికి అధికారి ప్రవర్తన మింగుడుపడలేదు. కనీస మర్యాద కూడా లేకుండా ఏకవచన సంబోధన చేయడం మరీ కంపరం కలిగించింది.

"మాది బలహీన వర్గాల కాలనీసార్! మొన్న వరదలకి మా ఇల్లు కూలిపోయిందని, నష్టపరిహారం కోసం మీకు దరఖాస్తు సమర్పించుకుందామని వచ్చాను...."

అతని మాటలు పూర్తి కావడంతోనే అంతెత్తున ఎగిరిపడ్డాడు అధికారి. తన ఎదురుగా బలహీన వర్గాల కాలనీ వాడు ఉన్నాడన్న చిన్న చూపు అతనిలో అహాన్ని సంతృప్తిపరిచినట్టుంది 'వీడేం చేయగలడు నన్ను' అనే భావంతోఫ

"నీ ఇల్లు కూలిపోతే మమ్మల్నేం చేయమంటావ్... మేమంతా వచ్చి నీకు ఇల్లు కట్టిపెట్టాలా?.... అయినా ఆ



**ఒక చలన చిత్ర ఇంటర్వ్యూలో**

ప్ర: తెలివైన నిర్మాతంటే?

జ: చిత్రం ఆఖరి సీన్లో హీరోకు పారితోషికం ఇవ్వాల్సి వస్తుందని డమ్మీ పిస్టల్ బదులు అసలైన పిస్టల్ పెట్టేవాడు.

ఆర్.శ్రీనివాస చౌదరి [సంబల్‌పూర్]

కాగితమేదో బయట గుమాస్తా చేతికివ్వకుండా... ఇదేదో నీ బాబుగాడి ఇల్లులాగ నరాసరి లోపలికొచ్చేయడమేనా?.... సరి... సర్లే.... వెళ్లు బయటకు" కసురుకున్నాడు అధికారి.

"వరదలు కాదుగానీ.... ప్రతి అడ్డమైన వాడూ నాకూ ఇల్లుంది. అది కూలిపోయిందీ... డబ్బులివ్వండో అంటూ ఎగబడ్డమే?..... అసలీ వరదలు ఇలాంటి అవారాగాళ్ళను బాగు చేయడానికే వచ్చుంటాయి....." కోపంతో రెచ్చిపోతూ అధికారి చేస్తున్న వ్యాఖ్యానాలకు అతనిలో ఆవేశం ముంచుకొచ్చింది. అయినా, దానిని పంటి బిగువున తొక్కిపట్టి, అవమాన భారంతో నేలలోకి దిగిపోయినట్టున్న ముఖంతో బయటకు నడిచాడు.


ఆఫీసు దాటి ఇంటివైపు కదులుతున్నాడన్న మాటే గానీ, అతని మనసు మనసులోలేదు.

'ఇదంతా రాములుగాడే చేశాడు' ఒక్కసారిగా అధికారి చేసిన అవమానం వల్ల ఏర్పడిన కోపం అంత ఇప్పుడు రాములువైపు తిరిగింది.

అసలిక్కడకు వెళ్లాలనే తలంపేలేదు అతనికి.

రాములే బలవంతంగా కాగితం రాయించాడు.

'వరదల్లో అసలంటూ తమ ఇళ్ల అరుగులు కూడా తడవని కుటుంబాల వారంతా మసిపూసి మారేడుకాయచేసినట్టు ఏవో ఉన్నవి కొన్ని.... లేనివి అన్నీ....



"ఇవి తెలివితేటలు. మీ నాన్న రాసిస్తే వచ్చే ఆస్తిపాస్తులు కావు." గొప్పగా చెప్పి పొడుపుగా అన్నాడు మధు భార్యతో.

"అందుకేగా, అవీ, ఇవీ కూడా లేవు మీకు" ఎదురుదెబ్బ తీసింది భార్య.

పి.సరోజ [అమలాపురం]

సృష్టించేసి.... నష్టపరిహారం డబ్బు ఎగరేసుకుపోతుంటే, మొత్తం ఇల్లంతా కూలిపోయి... ఎంతో నష్టానికి గురైన నువ్వెందుకు వాళ్లిచ్చే నష్టపరిహారం తెచ్చుకోకూడదంటూ రెచ్చగొట్టి మరీ వదిలాడు.

అందుకే, రాములుగాడి మాట కాదనలేక, ఆఫీసోళ్ళు ఇచ్చే ఐదొందల నష్టపరిహారంతో ఇల్లు నిలబెట్టే అవకాశం లేదని తెలిసి కూడా వచ్చాడు.

తీరా వచ్చినందుకు జరిగింది అవమానం.

ఆఫీసులో ఇవ్వకుండా వెనక్కి తెచ్చేసిన దరఖాస్తు కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాడు అతను. ఇప్పుడు సంతృప్తిగా ఉంది అతనికి.

* *** *

వెంకటరత్నం అతని పేరు.

ఆ ఊర్లో వెంకటరత్నం అనే వ్యక్తి ఉన్నట్టు ఓటర్ల లిస్టులోను, రేషన్‌కార్డులోనూ తప్ప..... అతని ఉనికి మాత్రం ఆ కాలనీలో ఏ కొద్ది మందికో తప్ప అందరికీ తెలీదు.

తనపని తాను చేసుకుపోవడం మినహా, మరో వ్యవహారం జోలికి వెంకటరత్నం ఎప్పుడూ వెళ్లి ఎరుగడు.

ఇంటికి వచ్చాడన్న మాటేగాని, వెంకటరత్నం మనసంతా అగ్నిగుండంలా మండుతోంది. వరదల్లో ఇల్లు కూలిపోయిం తర్వాత, భార్యా, పిల్లల్ని పుట్టింటికి పంపించేసి, రాములు ఇంట్లో ఉంటున్నాడు అతను.

నీరసంగా ముఖం వ్రేలాడేసుకుంటూ రావడమేకాక, తనలోతానే కోపంగా గొణుక్కుంటున్న వెంకటరత్నాన్ని చూశాడు రాములు.

"వెళ్లిన పని అయ్యిందేట్రా?.... మళ్ళీ ఎప్పుడు రమ్మన్నారు నష్టపరిహారం తీసుకుందుకు?.... అడిగాడు.

"ఒరే రాములూ! నేను మా అత్తవారింటికి వెళ్తున్నాను గానీ, కూలిపోయిన మా ఇంటి కలప, గుమ్మాలు ఎవరూ ఎత్తుకెళ్లకుండా కాస్త కనిపెట్టుకుండ్రా రెండోజుల్లో వచ్చేస్తాను....."

అప్పటి కప్పుడు బయల్దేరుతూ అన్నాడు వెంకటరత్నం.

తనడిగిందానికి సమాధానం చెప్పకుండా, రేపో, ఎల్లుండో నాలుగు దుంగలు తెచ్చి నిలబెట్టి, ఎలాగోలా పాక వేసుకుంటాను సాయం చెయ్యరా బాబూ అంటూ ఆఫీసు కెళ్లడానికి ముందే అని, వెళ్లిన వాడు ఇప్పుడిలా వింతగా ప్రవర్తించడం అంతర్యమేమిటో రాములికి అర్థం కాలేదు.

అతను ఆశ్చర్యంగా చూస్తుండగానే వెంకటరత్నం ఏవో ఆలోచనలతో అక్కడ్నుంచి వెళ్లిపోయాడు.

* *** *

రాములికి అత్తారింటికి వెళ్తున్నానని చెప్పిన వెంకటరత్నం ఇప్పుడు ఆ ఊరుకు ప్రక్కనున్న పట్టణంలోని హొటల్ గదిలో ఉన్నాడు.

'డబ్బుంటే కొండమీది కోతైనా కిందికి దిగుతుందంటారే'.... అలాగ, అతను ఖర్చు పెట్టిన డబ్బు మహత్యంతో ఆ ఊర్లోని ఆఫీసులో తనకు అవసరమైన రిజిష్టర్లు,..... కాగితాలు..... అన్నీ ఇరవై నాలుగ్గంటలు తిరక్కుండానే తన కాళ్ళ దగ్గరకు రప్పించుకున్నాడు.

వాటినన్నింటినీ జిరాక్స్ కాపీలు తీయించి, అవి దగ్గరుంచుకొని, రిజిష్టర్లను ఎక్కడ్నుంచి వచ్చాయో అక్కడకే పంపేశాడు.

వెంకటరత్నం ముఖం ఇప్పుడు ఆనందంతో వెలిగిపోతూంది.

వరద బాధితుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన లక్షలాది రూపాయల నష్టపరిహారం అసలు బాధితులకు చేరకుండా దొంగ బాధితుల సంతకాలతో అధికారి, అతని సిబ్బంది బృందం చేసిన మోసం ఇప్పుడు వెంకటరత్నం చేతిలో ఉన్న జిరాక్స్ కాపీలలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఆ రోజు సాయంత్రమే, హొటల్ రూమ్‌లో ఫోన్ రిసీవర్ ఎడం చేత్తో తీసి పట్టుకొని, కుడిచేతి చూపుడు వ్రేలుతో ఐదు నంబర్లు డయల్ చేశాడు వెంకటరత్నం.

సెకెండ్ల కాలంలో అవతల వ్యక్తి లైనులోకి రాగానే విషయం చెప్పి, రిసీవర్ క్రెడిల్ చేశాడు.

కేవలం గంటంటే గంట కాలంలో తనున్న హొటల్ గదిలో అధికారి, అతని సిబ్బందీ తన ముందు ప్రత్యక్షం కావడంని తృప్తిగా చూశాడు వెంకటరత్నం.

ముందు అతన్ని చూడగానే అధికారి ఖంగుతిన్నాడు.

అఫ్టాల్ ఐదు వందల రూపాయల నష్టపరిహారం కోసం వచ్చిన వాడ్ని అసలైన వరద బాధితుడైనా అవమానించి పంపినందుకు 'పరిహారం'గా ఇప్పుడు లక్ష రూపాయలు చెల్లించాల్సిన పని పడినందుకు అతను బాధపడుతున్నాడు. తనని తానే లోపల తిట్టుకుంటున్నాడు.

'లక్ష రూపాయలు మరీ అన్యాయం....' అంటూ గింజుకో బోతున్న హెడ్ గుమాస్తా నోరునొక్కేశాడు.

"చూడండి సార్! మీరు వరదపేరుతో సొమ్ము చేసుకున్నది అంతకు రెండింతలన్న సంగతి ఇదిగో ఈ కాగితాల్లో ఉంది. మరీ మీరు నీల్గారనుకోండి... ఇవి చేరాల్సిన చోటుకు చేరిస్తే, మీ అందిరికీ జరగాల్సింది జరిగిపోతుంది......' భగవత్గీ[illegible] వెంకటరత్నం.

ఇందాక అధికారి తన నోరెందుకు నొక్కాడో ఇప్పుడు [illegible] హెడ్ గుమాస్తా 'చెడు మాట్లాడకూడ[illegible] కోతి బొమ్మలా' రెండు చేతుల్తో నోరు మూసేసుకున్నాడు టక్కున.


అక్కడ లక్ష రూపాయలు నిండి ఉన్న బ్రీఫ్ కేస్.... లక్షల రూపాయల వరద రాజకీయాన్ని దాచుకున్న జిరాక్స్ కాపీలు చేతులు మారాయి.

అధికారి, ఆయన సిబ్బంది ఎక్కిన జీపు హొటల్ ఆవరణ దాటీదాటక ముందే, రూమ్ ఖాళీ చేసిన వెంకటరత్నం ఊరికి ప్రయాణమయ్యాడు.

* *** *

ఇప్పటి వరకూ ఓటర్ లిస్టుకూ, రేషన్‌కార్డుకూ, రాములుగాడు లాంటి కొద్ది మంది లేబర్ కాలనీ వాళ్ళకు మాత్రమే తెలియబడ్డ వెంకటరత్నం అకస్మాత్తుగా అన్ని పేపర్లలోనూ ఎక్కి, ఒక్కసారే ప్రముఖుడయిపోయాడు. ఇప్పుడు వెంకటరత్నం ఆ కాలనీలోనే కాదు, ఆ ఊర్లోను... అంతేనా.?... ఆ చుట్టు పక్కల అన్ని ఊర్లలోనూ అందరికీ పరిచయస్తుడే!

ఉన్నట్టుండి... వెంకటరత్నంకు అంత "గుర్తింపు' ఎందుకొచ్చిందో మీరు చెప్పగలరా!?




మీ బంధువులు వచ్చి పది రోజులైనా వెళ్లలేదా?"

"అవును. బట్టలు పెడితేగానీ వెళ్లరు. నువ్వే వెయ్యి సర్దు."


"అంత అప్పు చేసి బట్టలు పెట్టడమెందుకు?"

"మరేం చెయ్యను వాళ్ల బట్టలతో మా ఆవిడ స్టీలు గిన్నెలు కొనేసింది."

**పణతి విజయ్య ప్రకాష్ [చిలకలూరిపేట]**



# లైంగికశక్తికి హానిచేసే మందులు



**కొ**న్ని వ్యాధులకు ఉపయోగించే మందులు రోగి లైంగిక జీవితం మీద దెబ్బ తీయవచ్చు. లైంగిక వాంఛను తగ్గించడం, లైంగిక సామర్థ్యాన్ని తగ్గించడం వంటి దుష్ఫలితాలు కనిపిస్తాయి. స్త్రీలలోను, పురుషులలోనూ కూడా ఇటువంటి ప్రభావాలు కనిపించవచ్చు. అయితే ఇటువంటి లక్షణాలు కనిపించడానికి చాలాకాలం పడుతుంది. నెలలు, సంవత్సరాలు కూడా పట్టవచ్చు. అందువల్ల రోగులు తమలో కనిపించే లైంగిక లోపాలకు కారణం తాము వాడుతున్న మందులే అని తెలియక చాలా మనోవ్యాకులతకు గురి అవుతారు. ఒక్కొక్కప్పుడు సంసార జీవితంలో తీవ్ర పరిణామాలకు కూడా దారి తీయవచ్చు.

లైంగికంగా హానిచేసే మందులు కొన్ని వ్యాధులకు చాలా అమూల్యమైనవి కావచ్చు. అవి వాడకపోతే రోగి ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలగవచ్చు. పైగా లైంగిక దుష్ప్రభావాలు అరుదుగా కనిపించవచ్చు. చాలామంది రోగులు లైంగిక విషయాలను గురించి బయటకు చెప్పుకోక తమలో తామే మథనపడవచ్చు. డాక్టర్లు కూడా అటువంటి మందులు ప్రిస్క్రైబ్ చేసే ముందు వాటి దుష్ప్రభావాలను గురించి రోగికి చెప్పరు. అటువంటి ప్రభావాలు వెంటనే కనిపించకపోవడమే ఇందుకు కారణం. పైగా ముందు చెబితే రోగి ఆ మందులు వాడటానికి ఇష్టపడకపోవచ్చు. కనుక డాక్టర్లకు, రోగులకు కూడా ఇదొక సున్నితమైన సమస్య. కొన్ని సందర్భాలలో రోగికి అనుమానం కలిగి తన సమస్యను డాక్టర్‌కు చెబితే డాక్టరు మందు మార్చే అవకాశం లేకపోలేదు. అందువల్ల అటువంటి మందులను గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవడం అవసరం.

1. **నిద్రమాత్రలు** : ఆల్‌ప్రజోలాం [ఆల్‌ప్రాక్స్, జాలాక్స్], డయిజీపాం [వాల్యూమ్, కాంపోస్ మొ॥] క్లోరోడయజెపాక్సైడ్ [లిబ్రియం, ఈక్విలిబ్రియం మొ॥] ఇంకా అనేక రకాల నిద్రమాత్రలు.

2. **ఆంటిడిప్రెసెంట్‌లు** : ఫ్లోక్సెటిన్ హైడ్రోక్లోరైడ్, ఎమిట్రిప్టిలిన్, హైడ్రోక్లోరైడ్ మొ॥ పై రెండు రకాల మందులకు బదులు ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను అవలంబించడం మంచిది. ఉదాహరణకు తగుమాత్రం వ్యాయామం, ధ్యానం, ప్రవర్తనను మార్చే చికిత్స మొ॥

3. **బ్లడ్‌ప్రెషర్ మందులు** : ప్రొప్రనలాల్ [ఇండెరాల్, బీటాస్పాన్], మెథిల్‌డోపా, క్లోనిడైన్ హైడ్రోక్లోరైడ్ మొ॥ వీటికి బదులు బ్లడ్‌ప్రెషర్ తగ్గించడానికి ఇతర మందులు వాడవచ్చు.

4. **కడుపులో పుళ్ల మందులు** : సిమెటిడిన్ అనే మందు సాధారణంగా వాడతారు కాని దానికి బదులు రానిటిడైన్ హైడ్రోక్లోరైడ్ అనే మందుకు దుష్ప్రభావాలు తక్కువ. ఆంటిబయాటిక్స్ కూడా వాడవచ్చు.

5. **ఆకలి మందగింపజేసే మందులు** : లావు తగ్గడానికి కొంతమంది ఆకలి మందగించే మందులు వాడతారు. ఉ॥ ఫేన్‌ఫ్లూరమైన్ హైడ్రోక్లోరైడ్. కాని ఒళ్లు తగ్గడానికి ఇతర మార్గాలు అవలంబించడం మంచిది.

6. **పార్శ్వపు తలనొప్పి మందులు** : వీటిలో లోగడ పేర్కొన్న బ్లడ్‌ప్రెషర్ మందు ప్రొప్రనలాల్ కూడా తరచు వాడుతూ ఉంటారు. ఇంతకన్న పార్శ్వపు నొప్పికి ఇతర విధానాలు అవలంబించడం మంచిది.

కుటుంబ నియంత్రణకు ఉపయోగించే కొన్ని హార్మోన్‌లు కూడా లైంగికవాంఛను హరిస్తాయి.

వీటిలో ముఖ్యమైనది ప్రొజెస్టిన్ అనే స్త్రీ లైంగిక హార్మోన్. ఎలర్జీ మందులు, మానసిక వ్యాధులకు ఉపయోగించే కొన్ని మందులు, మూర్ఛ, కాన్సర్, గుండెజబ్బులు మొదలైన వాటికి ఉపయోగించే కొన్ని మందులకు కూడా లైంగికంగా హాని కలిగించే గుణం ఉంది.

అయితే ఈ మందుల ప్రభావాలు అందరిమీద ఒకే రకంగా ఉండకపోవచ్చు. కొంతమందికి ఎటువంటి దుష్ప్రభావాలు కనిపించకపోవచ్చు. ఒక్కొక్కప్పుడు రోగి ఆరోగ్య దృష్ట్యా ఒక మందు తీసుకోవడం తప్పనిసరి అవుతుంది. అప్పుడు లైంగిక దుష్ప్రభావాలను తాత్కాలికంగా విస్మరించక తప్పదు. ఏది ఏమైనా డాక్టరు సలహా ప్రకారమే మందులు వాడాలి.

\- **ఆర్.ఎల్.**